సాక్షి మంచిర్యాల

శనివారం । 28 । జూన్ । 2025



ఎట్టకేలకు వేతనాలు

ఉమ్మడి జిల్లాలోని డీఎస్సీ-2008 ఎస్జీటీలకు వేతనాలు విడుదలయ్యాయి. 61మంది ఉపాధ్యాయులకు రూ.2.50కోట్లు విడుదల చేస్తూ ఉత్తర్వులు వచ్చాయి. 8లో▸



జీవో 49ని అమలు కానివ్వం

జీవో 49ని అమలు కాకుండా చూస్తామని ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. ఉట్నూర్‌లో ఆదివాసీ సంఘాలతో సమావేశం అయ్యారు. 8లో▸

గరిష్ఠం/కనిష్ఠం
33.0 /27.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. పగటి ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి. పడమర దిశగా ఈదురుగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

యూరియా అందుబాటులో ఉంచాలి



నెన్నెలలో డీలర్లతో సమావేశమైన ఏడీఏ సురేఖ

సాక్షి స్పందన

నెన్నెల: రైతులకు యూరియా అందుబాటులో ఉంచాలని భీమిని ఏడీఏ సురేఖ డీలర్లకు సూచించారు. శుక్రవారం 'సాక్షి'లో 'యూరియా కోసం బారులు' శీర్షికన ప్రచురితమైన వార్తకు ఆమె స్పందించారు. మహిళా ఉత్పత్తిదారుల కేంద్రంతోపాటు ఎరువుల దుకాణాలు తనిఖీ చేశారు. మహిళా ఉత్పత్తి కేంద్రం వద్ద రైతులు వరుసలో ఉండేలా ఎందుకు చర్యలు చేపట్టలేదని నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం మండల వ్యవసాయాధికారి కార్యాలయంలో డీలర్లతో సమావేశం నిర్వహించారు. రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా విత్తనాలు, ఎరువులు, పురుగుల మందులు అందుబాటులో ఉండేలా చూడాలని తెలిపారు. ఏఓ సృజన, ఏఈఓ రాంచందర్ పాల్గొన్నారు.

'పది' సప్లిమెంటరీ పరీక్షల్లో 342 మంది ఉత్తీర్ణత

మంచిర్యాలఅర్బన్: పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల్లో 342 మంది ఉత్తీర్ణత సాధించారు. శుక్రవారం విడుదలైన ఫలితాల్లో జిల్లాకు చెందిన 96.88శాతం విద్యార్థులు పాసయ్యారు. మొత్తం 353 మందికి గాను 342 మంది ఉత్తీర్ణులయ్యారు. ఇందులో 206 మంది బాలురకు గాను 198 మంది, 147 బాలికలకు గాను 144 మంది ఉత్తీర్ణత సాధించినట్లు డీఈవో యాదయ్య తెలిపారు. మార్కులు తిరిగి లెక్కింపు కోసం విద్యార్థులు సబ్జెక్టుకు రూ.500 చొప్పున జూలై ఏడులోపు బ్యాంకులో చలానా చెల్లించి దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

బీసీల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలి



లేఖను ప్రదర్శిస్తున్న జాతీయ బీసీ హక్కుల పోరాట సమితి నాయకులు

పాతమంచిర్యాల: బీసీల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని జాతీయ బీసీ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు గుమ్ముల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో జాతీయ బీసీ కమిషన్ చైర్మన్ హన్స్‌రాజ్ గంగారం అహీర్‌కు నాయకులతో కలిసి బహిరంగ లేఖ విడుదల చేశారు. కేంద్రంలో బీసీ మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేసి బీసీ సబ్‌ప్లాన్‌ను రూ.2 లక్షల కోట్లతో ఏర్పాటు చేయాలని, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో బీసీలకు 50శాతం రిజర్వేషన్ కల్పించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ హక్కుల పోరాట సమితి జిల్లా సీనియర్ నాయకులు తులా మధుసూదన్, కర్రె లచ్చన్న, గజెల్లి వెంకటయ్య, భీంసేన్, గాజుల ప్రభాకర్, ఎస్.కిష్టయ్య, అంకం సతీష్ పాల్గొన్నారు.

పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి



ఇటిక్యాలలో ఇంటిని పరిశీలిస్తున్న జిల్లా వైద్యాధికారి హరీష్‌రాజ్

లక్సెట్టిపేట/మంచిర్యాలరూరల్(హాజీపూర్): వర్షాకాలం దృష్ట్యా ప్రజలు ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా వైద్యాధికారి హరీష్‌రాజ్ అన్నారు. శుక్రవారం లక్సెట్టిపేట మున్సిపాల్టీ పరిధిలోని ఇటిక్యాలలో వార్డులను పరిశీలించారు. హాజీపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆస్పత్రి పరిసరాలు, వార్డులు, ల్యాబ్, ఫార్మసీ రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఏడాది ఇటిక్యాలలో చాలామంది డెంగీ బారినపడ్డారని, డెంగీ రహితంగా ప్రకటించేలా కార్యాచరణ చేపట్టాలని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో ప్రోగ్రాం అధికారి ప్రసాద్, వైద్యులు సతీష్‌కుమార్, లింగారెడ్డి, పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ లహరి, ప్రోగ్రాం అధికారి డాక్టర్ ప్రసాద్, ఎస్‌సీడీ అధికారి డాక్టర్ శివప్రతాప్, డీఈఎంఓ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణలు.. అపరిశుభ్రత

- వర్షాలు పడితే వరద నీరు పారడం కష్టమే
- డ్రెయినేజీల్లోనూ నిండిన పూడిక
- రోడ్లపై పారుతున్న మురుగునీరు



మంచిర్యాల పట్టణంలోని హైటెక్‌సిటీ కాలనీలో రోడ్డుపైన పారుతున్న డ్రెయినేజీ నీరు

సాక్షి ఫోకస్



రాముని చెరువు మత్తడి కాలువపై స్లాబ్ వేసిన దృశ్యం



మంచిర్యాలలోని రెడ్డికాలనీ డ్రెయినేజీలో పేరుకుపోయిన చెత్త, పిచ్చిమొక్కలు

మంచిర్యాలటౌన్: పేరుకే జిల్లా కేంద్రం.. ప్రతియేటా వర్షాకాలంలో నగరంలోని కొన్ని కాలనీలకు వరద ముప్పు పొంచి ఉంటోంది. నగరాన్ని ఆనుకుని రాళ్లవాగు, తోళ్లవాగులు ప్రవహిస్తుండగా.. ఈ నీరు నేరుగా వెళ్లి గోదావరినదిలో కలుస్తుంది. డ్రెయినేజీల ద్వారా వెళ్లే నీరు వాగుల్లోకి చేరి అక్కడి నుంచి గోదావరిలో కలుస్తుండడం, ప్రతియేటా వర్షాకాలంలో వరద నీరు వాగుల ద్వారా వెనక్కి వచ్చి పలు కాలనీలు నీటమునగడం జరుగుతోంది. సాధారణ వర్షాలకే వరద నీరు నిండి డ్రెయినేజీల నుంచి బయట రోడ్లపై చేరుతోంది. హైటెక్‌సిటీ కాలనీలోని డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారడంతో కాలంతో సంబంధం లేకుండా మురుగు నీరు రోడ్లపై పారుతోంది. వర్షాకాలంలో వరద నీరు తోడై నడవలేని పరిస్థితి ఎదురవుతోంది. రామునిచెరువు మత్తడి కాలువ ద్వారా చెరువునీటితోపాటు స్థానికంగా డ్రెయినేజీ నీరు ఈ కాలువ ద్వారానే వెళ్లి రాళ్లవాగులో కలుస్తుంది. మత్తడి కాలువలో పిల్లర్లు వేసి స్లాబ్ వేయడం వల్ల మురుగు నీరు పారేందుకు అడ్డుగా మారుతోంది. గతంలో స్లాబ్‌లను కార్పొరేషన్ అధికారులు తొలగించగా మళ్లీ వేస్తుండడంతో వరద నీరు పారడం కష్టమే. కాలువ ఉప్పొంగి పక్కనే ఉన్న ఇస్లాంపుర కాలనీకి వరద ముప్పు ఏటా పొంచి ఉంటుంది. పట్టణంలోని రాంనగర్, రెడ్డికాలనీ, ఎన్టీఆర్‌నగర్, పద్మశాలికాలనీ, ఆదిత్య ఎన్‌క్లేవ్, బృందావనం కాలనీ, సూర్యనగర్ కాలనీలు చిన్నపాటి వర్షానికే వరద నీరు చేరి ముంపుగా మారుతున్నాయి. వర్షాకాలానికి ముందే డ్రెయినేజీల్లోని చెత్తాచెదారం, పిచ్చి మొక్కలు తొలగించాల్సి ఉండగా ఇప్పటికీ చేపట్టలేదు. ఈ కారణంగా కూడా డ్రెయినేజీల్లోని మురుగునీరు రోడ్లపైకి పారుతోంది.

విపరీతంగా ఈగలు, దోమలు



బలిజవాడలో శుభ్రం చేయని డ్రెయినేజీ



జెండవాడకు వెళ్లే దారిలో చెత్తకుప్పలు

చెన్నూర్: మున్సిపాల్టీ పరిధిలో మురికి కాలువలు అస్తవ్యస్తంగా మారాయి. దీంతో వర్షాకాలం సీజనల్ వ్యాధులు పొంచి ఉన్నాయి. ప్రధాన రోడ్లలో వ్యాపార సముదాయాలు, డ్రెయినేజీలపై స్లాబ్‌లు వేయడంతో మురికి కాలువలు శుభ్రం చేయడం కష్టమవుతోంది. ఆయా ప్రాంతాల్లో చెత్తాచెదారం పేరుకుపోవడంతో భారీ వర్షాలు కురిసిన సమయంలో డ్రెయినేజీల నీరు రోడ్లపై పారుతోంది. పాతబస్టాండ్ నుంచి మార్కెట్‌కు వెళ్లే దారిలో డ్రెయినేజీల్లోని నీరు వర్షాకాలంలో మేరవాడలోని ఇళ్లలోకి చేరుతోంది. దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పాతబస్టాండ్ నుంచి ఖబ్రస్తాన్ పక్కన ఉన్న డ్రెయినేజీలు శుభ్రం చేయించాల్సిన అవసరం ఉంది. పట్టణంలోని బలిజవాడ, జెండవాడ, ఇందిరానగర్, బేతాళవాడ, ఆదర్శనగర్, లైన్‌గడ్డ ప్రాంతాల్లో మురికికాలువలు శుభ్రం చేయకపోవడంతో చెత్తతో నిండి దుర్వాసన వెదజల్లుతున్నాయి. పలు కాలనీల్లో రోడ్లపై వేసిన చెత్త తొలగించకపోవడంతో కుళ్లిపోతోంది. చెత్తకుప్పలు, మురికికాలువలతో ఈగలు, దోమలు వృద్ధి చెందాయి. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉంది. దోమలు, ఈగల నివారణకు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని కాలనీల ప్రజలు ఆరోపిస్తున్నారు. జిల్లా అధికారులు స్పందించి పారిశుద్ధ్య నిర్వహణ సక్రమంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

కాలువల్లో గడ్డి



డ్రెయినేజీలు చెత్తాచెదారంతో నిండిపోయాయి. కాలువలు శుభ్రం చేయకపోవడంతో గడ్డి మొలుస్తుంది. దోమలు, ఈగలు విపరీతంగా పెరిగాయి. కొన్ని డ్రెయినేజీలు సక్రమంగా లేక వర్షపు నీరు రోడ్లపై పారుతోంది. జ్వరాలు సోకక ముందే అధికారులు మురికి కాలువలు శుభ్రం చేయించాలి.

–మానికరౌతు తిరుపతమ్మ, బలిజవాడ

కాలనీ కంపు కొడుతోంది..



ఇందిరానగర్ కాలనీలో డ్రెయినేజీలు లేక మురుగు నీరు ఖాళీ స్థలాల్లో చేరి కంపు కొడుతోంది. డ్రెయినేజీలు నిర్మించి మురుగు నీరు నిలువకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదు. ఇప్పుడే నీరు నిలిచి దుర్వాసన వస్తుంది. వర్షాకాలంలో మురికినీరుతోపాటు వర్షపు నీరు నిలిస్తే భరించలేకుండా ఉంటుంది. అధికారులు స్పందించి ఖాళీ స్థలంలో నిలిచిన నీరును డ్రెయినేజీలకు మళ్లించే ఏర్పాటు చేయాలి.

–సీహెచ్.నవీన్, ఇందిరానగర్ కాలనీ

పూడిక నిండి.. పిచ్చిమొక్కలు పెరిగి..



అశోక్‌నగర్‌లో పిచ్చిమొక్కలతో ఆనవాళ్లు లేకుండా మూసుకుపోయిన వాగు

బెల్లంపల్లి: బెల్లంపల్లి ద్వితీయ శ్రేణి మున్సిపాల్టీలో మౌలిక సదుపాయాలు సరిగా లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. 34 వార్డుల్లోనూ సమస్యలు ఎదుర్కొంటున్నారు. శివారు వార్డులు తీవ్ర నిరాదరణకు గురవుతుండగా.. అన్ని వార్డుల్లో సమస్యలు తిష్ట వేసి అధికారుల నిర్లక్ష్యానికి అద్దం పడుతున్నాయి. వర్షాకాలంలో మరిన్ని ఇక్కట్లు ఎదురవుతున్నాయి. గంగారాంనగర్, కాల్‌టెక్స్ ఏరియా, షంషీర్‌నగర్, అంబేడ్కర్ నగర్, హన్మాన్‌బస్తీ, కన్నాల బస్తీ, మధునన్ననగర్, అశోక్‌నగర్, రైల్వేరడగంబాల బస్తీ, సుభాష్‌నగర్, గోల్‌బంగ్లాబస్తీ, శాంతిఖని, బెల్లంపల్లి బస్తీ తదితర ప్రాంతాల్లో మురికి నీటి కాలువలు అధ్వానంగా ఉన్నాయి. కొన్ని వీధుల్లో మురికి కాలువల్లో పూడిక నిండి, పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగాయి. మరికొన్ని చోట్ల నేటికీ మురికి కాలువల నిర్మాణం చేపట్టలేదు. సగానికిపైగా జనావాసాలను ఆనుకుని మురికి నీరు గుంతల్లో స్థిరంగా నిలిచి ఉండడంతో దోమలు వృద్ధి చెందాయి. బూడిదగడ్డ బస్తీ నుంచి అశోక్‌నగర్ మీదుగా ప్రవహించే వాగు నుంచి వచ్చే వరద నీరు వెళ్లిపోవడానికి డ్రెయినేజీలు నిర్మించకపోవడంతో చెట్లు, పిచ్చిమొక్కలు పెరిగి అటవీ ప్రాంతాన్ని తలపిస్తున్నాయి. చెదిరిన, గుంతలు పడిన రోడ్లపై రాకపోకలు సాగించడానికి వీల్లేకుండా తయారయ్యాయి. హన్మాన్‌బస్తీ–రాంనగర్ బస్తీ మధ్య వాగుపై లోలెవల్ వంతెన ఏటా వర్షాకాలంలో వరద నీటిలో మునిగి రాకపోకలకు అవస్థలు పడుతున్నారు.

ఇళ్లలోకి వరద నీళ్లు



మురికి కాలువ కట్టాలని ఎన్నో ఏళ్ల సంది వేడుకుంటున్నం. గెల్సినోళ్లు, అధికారులు మాటిచ్చి పట్టించుకుంట లేరు. గట్ల జేయబట్టి వరద నీరంతా కాలువ నిండా ప్రవహించి ఇండ్లల్లకత్తన్నయ్. నీళ్లు రాబట్టి పాయినేడు మా ఇంటి గోడ కూలిపోయింది. మళ్లా కట్టిచ్చినం. ఎవలకు ఎన్నిసార్లు జెప్పినా సరే అని అంటండ్లు కానీ చెవిన పెడ్తలేరు. ఈసారైనా మురికి కాలువ కట్టిచ్చి నీళ్లు ఇండ్లల్లకు రాకుండా చర్యలు తీసుకోవాలే.

– లింగాల రాములు, అశోక్‌నగర్

చదువుతో జ్ఞానం, ధైర్యం



శిలాఫలకం ఆవిష్కరణలో ఎమ్మెల్యే వినోద్

వేమనపల్లి: చదువు మనిషికి జ్ఞానం, ధైర్యాన్ని అందిస్తుందని బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ అన్నారు. శుక్రవారం ఆయన కలెక్టర్ కుమార్ దీపక్, మాజీ జెడ్పీటీసీ ఆర్.సంతోష్‌కుమార్‌తో కలిసి నీల్వాయి జూనియర్ కాలేజీలో రూ.66 లక్షలతో అదనపు గదుల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. వేమనపల్లిలో 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ పాఠశాలల్లో ఎలాంటి సమస్యలున్నా తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఎమ్మెల్యేకు పలు గ్రామాల రైతులు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సాబీర్‌ఆలీ, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు సమ్మయ్యమాదిగ, ట్రాన్స్‌కో ఎస్‌ఈ గంగారాం, ఎంపీడీఓ కుమారస్వామి, తహసీల్దార్ సంధ్యారాణి, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు సత్యనారాయణ, మాజీ సర్పంచ్‌లు గాలి మధు, తోకల రాంచందర్, మాజీ ఎంపీపీలు వెంకటేషం, లింగాగౌడ్ పాల్గొన్నారు.

రైళ్ల రాకపోకలకు అంతరాయం



మంచిర్యాల రైల్వేస్టేషన్‌లో ప్రయాణికులు

బెల్లంపల్లి: పెద్దపల్లి రైల్వే జంక్షన్ శివారులోని కూనారం ఆర్‌ఓబీ వద్ద క్లస్టర్ విరిగిపోయి గడ్డర్లు కుంగడంతో శుక్రవారం కాజీపేట-బల్లార్షా సెక్షన్ పరిధిలో పలు రైళ్ల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ముందస్తుగా ఈ మార్గంలో రైళ్లను ఎక్కడికక్కడ రైల్వేస్టేషన్లలో నిలిపివేయడంతో గంటలకొద్దీ ప్రయాణికులు ఇబ్బందులు పడాల్సి వచ్చింది. కొన్ని రైళ్లు పాక్షికంగా రద్దు చేసినట్లు దక్షిణ మధ్య రైల్వే అధికారులు ప్రకటించారు. మరికొన్ని రైళ్లను కాజీపేట నుంచి అటువైపే నడపాలని నిర్ణయం తీసుకున్నారు. దీంతో కుమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాల్లోని మంచిర్యాల, బెల్లంపల్లి, రవీంద్రఖని, రేచినీరోడ్ రైల్వేస్టేషన్, ఆసిఫాబాద్ ఎక్స్‌రోడ్, కాగజ్‌నగర్, సిర్పూర్ రైల్వేస్టేషన్లు బోసిపోయాయి. హైదరాబాద్-సిర్పూర్ కాగజ్‌నగర్-బీదర్ వెళ్లే ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ రైలు పొత్కపల్లి రైల్వేస్టేషన్ వరకు నడపనున్నారు. సికింద్రాబాద్-సిర్పూర్ కాగజ్‌నగర్-సికింద్రాబాద్ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ పాక్షికంగా కాజీపేట నుంచి సిర్పూర్ కాగజ్‌నగర్ మధ్యలో రద్దు చేశారు. భద్రాచలం రోడ్ నుంచి బల్లార్షా వైపు వెళ్లే సింగరేణి మెము ఎక్స్‌ప్రెస్ రైలు వరంగల్ నుంచి బల్లార్షా మధ్య పాక్షికంగా రద్దు చేసి వరంగల్ నుంచి భద్రాచలం రోడ్ వరకు నడపనున్నారు. కాజీపేట-సిర్పూర్ వైపు వెళ్లే మెము ఎక్స్‌ప్రెస్ రైలు పొత్కపల్లి వరకే నడుస్తుంది. బోధన్-సిర్పూర్ టౌన్-బోధన్ పుష్పుల్ రైలు రద్దు చేశారు. కాజీపేట-బల్లార్షా ఎక్స్‌ప్రెస్ రైలు రద్దయింది. భాగ్యనగర్ ఎక్స్‌ప్రెస్ రైలు కాజీపేట-సికింద్రాబాద్ మధ్య పాక్షికంగా రద్దు చేశారు.

రుణ లక్ష్యాల సాధనకు కృషి చేయాలి

- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



రుణ లక్ష్యం బుక్‌లెట్ విడుదల చేస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్, అధికారులు

మంచిర్యాలఅగ్రికల్చర్: జిల్లా వార్షిక రుణ లక్ష్యాల సాధనకు బ్యాంకర్లు కృషి చేయాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం సమీకృత కలెక్టరేట్ సమావేశ మందిరంలో లీడ్ బ్యాంక్ జిల్లా మేనేజర్ తిరుపతి, ఆర్‌బీఐ ఏజీఎం యశ్వంత్‌సాయి, నాబార్డ్ డీడీఎం వీరభద్రులు, తెలంగాణ గ్రామీణ బ్యాంకు రీజినల్ మేనేజర్ ప్రభుదాస్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజినల్ మేనేజర్ రాధాకృష్ణన్‌తో కలిసి వివిధ బ్యాంకుల అధికారులతో రుణ లక్ష్యసాధనపై సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ 2025–26 ఆర్థిక సంవత్సరానికి పంట రుణాలకు రూ.2,422 కోట్లు, దీర్ఘకాలిక రుణాలకు రూ.765 కోట్లు, వ్యవసాయ అనుబంధ రుణాలు రూ.157 కోట్లు, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కోసం రూ.249 కోట్లు, మొత్తం వ్యవసాయ రంగానికి రూ.4,203 కోట్లు లక్ష్యంగా నిర్దేశించినట్లు తెలిపారు. ప్రాధాన్యత రంగాలకు రూ.5,817 కోట్లు, ప్రాధాన్యేతర రంగాలకు రూ.1,940 కోట్లు నిర్దేశించినట్లు తెలిపారు. సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నారు. రైతులు రుణాలు సకాలంలో చెల్లించి తిరిగి పొందేలా అవగాహన కల్పించాలని తెలిపారు.

భాషా పండితుల పదోన్నతులకు కృషి



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు జగదీష్

మంచిర్యాలఅర్బన్: ఎన్నో కష్టాలను అధిగమించి భాషా పండితుల పదోన్నతులకు కృషి చేసినట్లు రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు జగదీష్ తెలిపారు. శుక్రవారం స్థానిక బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో రాష్ట్రీయ ఉపాధ్యాయ జిల్లా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పండితుల అప్‌గ్రేడేషన్ ప్రక్రియ కోసం పడిన కష్టాలను వివరించారు. జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జగదీష్‌ను భాషా పండిత ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా కొండ శ్రీధర్‌స్వామి, ప్రధాన కార్యదర్శిగా సత్యనారాయణచారి, గౌరవ అధ్యక్షుడిగా సంతోష్‌కుమార్‌శర్మ, కోశాధికారిగా శ్రీనివాసవర్మ, ఉపాధ్యక్షులుగా విశ్వప్రసాద్, నారాయణ, తిరుపతి, మహిళా ఉపాధ్యక్షురాలుగా శ్రీలత, సంయుక్త కార్యదర్శిగా రమేష్, సరేందర్, మహిళా కార్యదర్శులుగా యశోదలక్ష్మీ, నీల్‌కమల్, సాంస్కృతిక కార్యదర్శిగా శశికుమార్, రాష్ట్ర కార్యవర్గసభ్యులుగా మహేందర్‌రెడ్డి, శివప్రసాద్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

గిరిజనుల పోడు పోరు

- అడవిలో చెట్ల పొదల తొలగింపు
- అడ్డుకున్న అటవీ, పోలీస్ అధికారులు



పొదలు తొలగిస్తూ విత్తనాలు విత్తుతున్న గిరిజన మహిళలు

దండేపల్లి: మండలంలో కొద్ది రోజులుగా చల్లబడ్డ పోడు పోరు మళ్లీ మొదలైంది. అటవీ భూముల ఆక్రమణకు గిరిజనులు ప్రయత్నిస్తున్నారు. నాలుగైదు రోజులుగా మండలంలోని లింగాపూర్ అటవీ బీట్ 380 కంపార్ట్‌మెంట్‌లో దమ్మన్నపేట, మామిడిగూడ, గిరిజనులతోపాటు లింగాపూర్ గ్రామానికి చెందిన కొందరు నిరుపేదలు చెట్ల పొదలు తొలగిస్తున్నారు. అటవీ శాఖ అధికారులు నచ్చజెప్పే ప్రయత్నాలు చేస్తున్నా వినిపించుకోవడం లేదు. దీంతో నాలుగు రోజులుగా పోరు సాగుతోంది. శుక్రవారం లక్సెట్టిపేట సీఐ రమణమూర్తి, దండేపల్లి ఎస్సై తహసీనొద్దీన్ అటవీ ప్రదేశానికి వెళ్లి చెట్లపొదలు తొలగిస్తున్న వారితో మాట్లాడారు. వారికి కౌన్సెలింగ్ ఇచ్చివెళ్లారు. పోలీసులు, అటవీ అధికారులు వెళ్లిన వెంటనే గిరిజనులు మళ్లీ పొదలు తొలగిస్తూ విత్తనాలు విత్తారు.

లక్ష్యాల సాధనకు ప్రణాళికలు సిద్ధం చేయాలి



డైరెక్టర్(పీపీ) వెంకటేశ్వర్లుతో అధికారులు

శ్రీరాంపూర్/జైపూర్: నిర్దేశిత ఉత్పత్తి లక్ష్యాల సాధనకు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సింగరేణి డైరెక్టర్(ప్రాజెక్ట్ అండ్ ప్లానింగ్) కే.వెంకటేశ్వర్లు తెలిపారు. శుక్రవారం ఆయన శ్రీరాంపూర్ ఓపెన్ కాస్ట్ గనిని సందర్శించారు. క్వారీలోకి వెళ్లి కోల్ బెంచీలు, ఆఫ్‌లోడింగ్ ప్రదేశాలు పరిశీలించారు. జైపూర్ మండలం ఇందారం ఐకే-ఓసీపీ ఆవరణలో వనమహోత్సవంలో భాగంగా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2025–26 ఆర్థిక సంవత్సరంలో నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్యాన్ని నూరు శాతం సాధించాలని తెలిపారు. ప్రతి ఒక్కరూ బాధ్యతతో పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీరాంపూర్ ఏరియా జీఎం ఎం.శ్రీనివాస్, ఏరియా ఎస్ఓటు జీఎం యస్.సత్యనారాయణ, శ్రీరాంపూర్ ఓసీపీ పీఓ చిప్ప వెంకటేశ్వర్లు, ఇందారం ఓసీపీ పీఓ ఏవీ రెడ్డి, మేనేజర్లు నాగన్న, శంకర్, ఇంజనీర్ రామకృష్ణరావు, రక్షణాధికారి మహేశ్, ఫారెస్ట్ అధికారి మేఘన, సెక్యూరిటీ అధికారి జక్కారెడ్డి, ఫిట్ ఇంజనీర్ భీమన్న తదితరులు పాల్గొన్నారు.

భూగర్భ జలాల పనుల పరిశీలన



చింతలపల్లి నీటికుంటను పరిశీలిస్తున్న రాంబాబు

చెన్నూర్‌రూరల్: మండలంలోని 30 గ్రామ పంచాయతీల్లో జలశక్తి అభియాన్ కింద చేపట్టిన 46 వివిధ రకాల అభివృద్ధి పనులను శుక్రవారం కేంద్ర భూగర్భ నీటి బోర్డు శాస్త్రవేత్త రాంబాబు పరిశీలించారు. నీటికుంటల ప్రగతిని క్షేత్ర స్థాయిలో సమీక్షించి వివరాలు నమోదు చేసుకున్నారు. ఫారెస్టు ట్రెంచ్, చిన్న నీటికుంటలు, ఇంకుడు గుంతల నిర్మాణం, భూగర్భ రీచార్జ్ స్ట్రక్చర్‌ను పరిశీలించారు. ఎంపీడీవో మోహన్, నోడల్ అధికారి సదానందం, ఇంజినీరింగ్ కన్సల్టెంట్ సత్యనారాయణ, చంద్రశేఖర్, డీఆర్‌పీ రాజ్‌కుమార్, ప్లాంటేషన్ అధికారి శ్రీనివాస్, కుమారస్వామి, మధు, టీఏలు మహేశ్వర్‌రెడ్డి, రవీందర్, రవి, వెంకటస్వామి పాల్గొన్నారు.

క్లుప్తంగా

దేశీదారు పట్టివేత



పట్టుబడిన దేశీదారుతో పోలీసులు

వాంకిడి: మహారాష్ట్ర నుంచి ఆర్టీసీ బస్సులో అక్రమంగా తరలిస్తున్న దేశీదారును శుక్రవారం పట్టుకున్నట్లు ఎస్సై ప్రశాంత్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. విశ్వసనీయ సమాచారం మేరకు వాంకిడి బస్టాండ్‌లో ఏఎస్సై పోశెట్టి ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ చేపట్టారు. గడ్చిరోలి జిల్లా సిరోంచకు చెందిన మారగోని కృష్ణమూర్తిగౌడ్ బస్సులో దేశీదారు తరలిస్తూ పట్టుబడ్డాడు. అతడి నుంచి 250 (90ఎంఎల్) దేశీదారు మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. పట్టుబడిన మద్యం విలువ సుమారు రూ.12,500 ఉంటుందని పేర్కొన్నారు.

బస్సును ఢీకొన్న లారీ

సాత్నాల: భోరజ్ మండలంలోని తర్జం లోలెవెల్ వంతెన వద్ద అతివేగంగా వస్తున్న లారీ ముందు వెళ్తున్న మహారాష్ట్ర ఆర్టీసీ బస్సును ఢీకొట్టి వాగులో పడిపోయింది. ఈ ఘటనలో పలువురికి గాయాలయ్యాయి. ఎస్సై గౌతమ్ పవర్ తెలిపిన వివరాల ప్రకారం.. చంద్రాపూర్ నుంచి ప్రయాణికులను తీసుకుని ఆదిలాబాద్‌కు వస్తున్న మహారాష్ట్ర బస్సు గురువారం రాత్రి బ్రిడ్జి దాటుతుండగా వెనుక నుంచి అతివేగంగా వచ్చిన లారీ ఢీకొట్టడంతో పలువురికి గాయాలయ్యాయి. ఢీకొట్టిన వేగానికి లారీ బ్రిడ్జి కింద నదిలో పడిపోయింది. బస్సు డ్రైవర్ చౌహాన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒకరికి గాయాలు

ముథోల్: మండలంలోని రాజు తండా గ్రామానికి చెందిన మీరాబాయి అనే మహిళను గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో తీవ్ర గాయాలైనట్లు ఎస్సై బిట్లా పెర్సిస్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. మీరాబాయి గ్రామంలో బహిర్భూమికని ముథోల్ నుంచి ఆష్టా రోడ్డుకు వెళ్తుండగా గన్నారం వైపు స్పీడుగా వెళ్తున్న గుర్తుతెలియని వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆమె తీవ్ర గాయాలపాలైంది. గ్రామస్తులు చికిత్స కోసం 108లో భైంసా ఏరియా స్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

దాడి కేసులో ముగ్గురి రిమాండ్

నెన్నెల: మండలంలోని జోగపూర్ గ్రామానికి చెందిన సప్ప అనిల్, సునీల్‌కుమార్‌ను దాడి కేసులో శుక్రవారం రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై ప్రసాద్ శుక్రవారం తెలిపారు. ఈ నెల 3న అదే గ్రామానికి చెందిన సప్ప భీమయ్య బెల్లంపల్లి నుంచి బైక్‌పై వస్తుండగా దారికాచి కర్రలతో దాడి చేసి గాయపర్చారని పేర్కొన్నారు. భీమయ్య చెయ్యి విరిగి, కాలు, తలకు తీవ్ర గాయాలైనట్లు తెలిపారు. బాధితుడి మెడికల్ సర్టిఫికెట్ ఆధారంగా కేసు నమోదు చేసి నిందితులను రిమాండ్‌కు పంపినట్లు ఎస్సై తెలిపారు.

ఎట్టకేలకు వేతనాలు

- డీఎస్సీ–2008 ఎస్జీటీల సాలరీ నిధుల విడుదల
- గత ఫిబ్రవరిలో కాంట్రాక్ట్ ఉద్యోగులుగా చేరిక
- 61మంది ఉపాధ్యాయులకు లబ్ధి
- ఉమ్మడి జిల్లాకు రూ.2.5 కోట్లు విడుదల

ఉమ్మడి జిల్లాలో ఇలా..

జిల్లా	ఎస్జీటీలు	విడుదలైన నిధులు (రూ.లో)
నిర్మల్	14	58,51,000
ఆదిలాబాద్	07	29,25,500
కుమురంభీం	28	1,17,02,100
మంచిర్యాల	12	50,15,200
మొత్తం	61	2,54,93,800



నిర్మల్‌ఖిల్లా: ఉద్యోగ నియామకం కోసం పరీక్ష రాసి ఎంపికైన తర్వాత 15 ఏళ్లుగా వేచి చూసిన వారికి గత ఫిబ్రవరిలో నియామక ఉత్తర్వులు చేతికందాయి. ఫిబ్రవరి 16వ తేదీన కాంట్రాక్ట్ ఎస్జీటీలుగా కొలువులో చేరిన వీరికి ఇప్పటివరకు వేతనాలు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎట్టకేలకు ఉమ్మడి జిల్లాలోని ఎస్జీటీలకు రూ.2.5 కోట్ల నిధులు విడుదల చేస్తూ పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ ఈ నవీన్ నికోలస్ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో విధుల్లో చేరిన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పరిధిలోని 61 మంది కాంట్రాక్ట్ ఎస్జీటీలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

డీఎస్సీ 2008 బాధితులు..

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో నోటిఫికేషన్ వెలువడిన అనంతరం తీసుకున్న నిర్ణయం మేరకు 30 శాతం పోస్టులు ప్రత్యేకంగా డీఈడీ అభ్యర్థులకు కేటాయించడంతో అప్పుడు బీఈడీ పూర్తి చేసుకుని ఎస్జీటీలుగా ఎంపికైన ఉమ్మడి జిల్లాలోని 100 మందికి పైగా అభ్యర్థులు ఉద్యోగాలు కోల్పోయారు. అప్పటినుంచి దశాబ్దకాలానికి పైగా కోర్టుల్లో న్యాయపోరాటం చేస్తూ వస్తున్నారు. ఈ క్రమంలోనే అభ్యర్థులకు కాంట్రాక్ట్ విధానంలో ఎస్జీటీలుగా నియామకాలు పూర్తి చేయాలని హైకోర్టు ఆదేశించింది. ఈ మేరకు గత ఫిబ్రవరి 15వ తేదీన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని 61 మందికి నియామక ఉత్తర్వులు అందజేశారు. 16ఏళ్ల పాటు ఉద్యోగాలకు దూరమై కోర్టుల చుట్టూ తిరిగిన వీరికి నియామకాలు పొందిన తర్వాత కూడా దాదాపు నాలుగు నెలలు పూర్తవుతున్నా వేతనాలు రాక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలోనే తాజాగా 2025–26 విద్యా సంవత్సరానికి రాష్ట్రవ్యాప్తంగా బడ్జెట్ కేటాయించగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని నిర్మల్, ఆదిలాబాద్, మంచిర్యాల, కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లాల్లో కాంట్రాక్ట్ ఎస్జీటీలుగా విధులు నిర్వహిస్తున్న 61 మందికి వేతనాలు అందనున్నాయి. ఒక్కో ఎస్జీటీకి నెలకు బేసిక్ పే రూ.31,040 కాగా, నాలుగునెలల వేతనాలు వారి అకౌంట్లలో జమచేయనున్నారు.

సుదీర్ఘ నిరీక్షణ అనంతరం

నిర్మల్ జిల్లాలో 14 మంది, కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలో 28 మంది, ఆదిలాబాద్ జిల్లాలో ఏడుగురు, మంచిర్యాల జిల్లాలో 12 మంది కాంట్రాక్ట్ ఎస్జీటీలున్నారు. వీరి నాలుగు నెలల పెండింగ్ వేతనాలు చెల్లింపునకు ఉమ్మడి జిల్లాకు రూ.2కోట్ల 54లక్షల 93వేల 800 విడుదల చేయడంతో నిర్మల్ జిల్లాకు చెందిన కాంట్రాక్ట్ ఎస్జీటీలు గంగాధర్, రాజేశ్వర్, ప్రభ, చంద్రశేఖర్, వినోద్ తదితరులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మానవ అక్రమ రవాణా కేసులో మరో ఇద్దరి అరెస్ట్

- హరిదాస్‌ను కానిస్టేబుల్ ఉద్యోగం నుంచి శాశ్వతంగా తొలగింపు



నిందితుల అరెస్ట్ చూపి వివరాలు వెల్లడిస్తున్న ఏఎస్పీ చిత్తరంజన్, సీఐ రవీందర్

సాక్షి, ఆసిఫాబాద్: మానవ అక్రమ రవాణాకు పాల్పడి పరారీలో ఉన్న ఇద్దరు నిందితులను ఆసిఫాబాద్ పట్టణ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఇందుకు సంబంధించిన వివరాలను ఆసిఫాబాద్ సబ్ డివిజన్ ఏఎస్పీ చిత్తరంజన్ శుక్రవారం మధ్యాహ్నం సీఐ రవీందర్‌తో కలిసి విలేకరులకు వెల్లడించారు. వివరాలు ఆయన మాటల్లో.. 'మానవ అక్రమ రవాణా, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలుంటాయి. తన కూతురు ఏడాదిగా కనబడడం లేదని ఈ నెల 11న వాడిగొంది గ్రామవాసి ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా దర్యాప్తు ప్రారంభించాం. మహిళకు చెందిన ఆధార్ కార్డులోని ఫోన్ నంబర్‌కు కాల్ చేయగా.. ఆమె మధ్యప్రదేశ్‌లో ఉన్నట్లు పోలీసులకు తెలిపింది. ఆమె ఇచ్చిన సమాచారంతో ఒక పోలీస్ బృందాన్ని మధ్యప్రదేశ్‌కు పంపి ఆమెను ఇక్కడికి తీసుకువచ్చాం. ఆమె ఇచ్చిన వివరాల మేరకు.. చింతలమానేపల్లి పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తూ 2022 నుంచి విధులకు గైర్హాజరవుతున్న కామెరి హరిదాస్‌ను అదుపులోకి తీసుకుని విచారిస్తున్న నేపథ్యంలోనే.. తననూ కానిస్టేబుల్ హరిదాస్ ముఠా మోసం చేసి విక్రయించిందని ఆసిఫాబాద్ పట్టణ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ రెండు వేర్వేరు కేసుల్లో లోతుగా దర్యాప్తు చేపట్టగా మొత్తం 10 మందికి సంబంధం ఉన్నట్లు తెలిసింది. ఇందులో ఎనిమిది మంది నిందితులను 10రోజుల కిందట అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించాం. పరారీలో ఉన్న మధ్యప్రదేశ్‌కు చెందిన బషీర్ రమేశ్‌గౌడ్ (ఏ7), జగదీశ్ సోనీ (ఏ9)ని శుక్రవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించాం.' అని ఏఎస్పీ తెలిపారు.

'తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలి'

'పెళ్లికుమారుడికి వరకట్నం ఇస్తేనే ఆడపిల్లలకు పెళ్లిళ్లు జరుగుతున్న నేటి పరిస్థితుల్లో.. ఆడపిల్లకు ఎదురుకట్నం ఇచ్చి పెళ్లి చేసుకుంటామని మాయమాటలు చెప్పి మోసగించి ఇతర రాష్ట్రాలకు తరలిస్తున్న వారిపై తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలి. అసలు వారు తమ పిల్లను ఎందుకు పెళ్లి చేసుకోవాలనుకుంటున్నారు? వారి వివరాలు ఏమిటి? వారు ఎక్కడి నుంచి వచ్చారు? వారికి స్థానికంగా సహకరిస్తున్న వారెవరు? అలాంటి వారి గత చరిత్రపై ఆరా తీయాలి. ఎలాంటి సందేహం తలెత్తినా వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తే బాధితులకు న్యాయం చేస్తాం.' అని ఏఎస్పీ సూచించారు.

కానిస్టేబుల్ ఉద్యోగం నుంచి తొలగింపు

తిర్యాణి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఇదివరకు ఇలాంటి కేసులో ముద్దాయిగా ఉన్న కానిస్టేబుల్ కామెరి హరిదాస్.. మళ్లీ తన విధానం మార్చుకోకపోగా తాజాగా రెండు వేర్వేరు కేసుల్లో నిందితుడిగా తేలింది. దీంతో అతనిపై శాఖాపరమైన చర్యలకు ఉన్నతాధికారులకు సిఫార్సు చేయగా.. గురువారం అతన్ని ఉద్యోగం నుంచి తొలగిస్తున్నట్లు పోలీస్ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే పోలీసులపైనా కఠినచర్యలు ఉంటాయనడానికి కానిస్టేబుల్ హరిదాస్ ఉదంతమే ఒక నిదర్శనం.

సడెన్‌గా ఆగిన లారీని ఢీకొన్న ఆటో

- తీవ్రంగా గాయపడ్డ ఆటో డ్రైవర్ మృతి
- ఇద్దరు ప్రయాణికులకు తీవ్ర గాయాలు
- ఒకరి పరిస్థితి విషమం



రాజేశ్ (ఫైల్)



ఆటోలో రాజేశ్ మృతదేహం



గాయపడ్డ అజీమ్



గాయపడ్డ రమ

జైపూర్: కళ్లు మూసి తెరిచేలోపే మృత్యువు కబలించింది. వేగంగా వెళ్తున్న లారీ ఒక్కసారిగా ఆగడంతో వెనుక వస్తున్న ఆటో అదుపు తప్పి బలంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆటో డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందగా, ఇద్దరు ప్రయాణికులు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మంచిర్యాలలోని సాయిరాంనగర్‌కు చెందిన పొడల రాజేశ్ (30) ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. శుక్రవారం ఉదయం మంచిర్యాల నుంచి గోదావరిఖనికి రాళ్లపేటకు చెందిన సయ్యద్ అజీమ్, బెల్లంపల్లికి చెందిన ఆయిల్ల రమను ఆటోలో గోదావరిఖనికి తీసుకువెళ్తున్నాడు. ఇందారం అటవీ శాఖ చెక్‌పోస్టు దాటిన తర్వాత గోదావరి బ్రిడ్జి వద్ద మంచిర్యాల నుంచి గోదావరిఖని వైపు వేగంగా వెళ్తున్న లారీని డ్రైవర్ సడెన్‌గా బ్రేక్ వేసి నిలిపివేయడంతో వెనుకే వస్తున్న ఆటో అదుపు తప్పి బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆటో ముందు భాగం నుజ్జునుజ్జు కాగా, ఆటో డ్రైవర్ రాజేశ్ తలకు బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. వెనుక కూర్చున్న ఇద్దరు ప్యాసింజర్లు సయ్యద్ అజీమ్, అయిల్ల రమ తీవ్రంగా గాయపడ్డారు. వీరిని 108 అంబులెన్స్‌లో గోదావరిఖని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. రమ తలకు బలమైన గాయం కావడంతో ఆమె పరిస్థితి విషమంగా మారింది. దీంతో ఆమెను కరీంనగర్‌కు తరలించారు. ఘటనాస్థలాన్ని స్థానిక ఎస్సై శ్రీధర్ పరిశీలించి కేసు నమోదు చేశారు. మృతుడు రాజేశ్‌కు ఇద్దరు భార్యలు లావణ్య, గాయత్రి ఉన్నారు. రెండ్రోజుల క్రితం ఇదే ప్రాంతంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, మరొకరు గాయపడడం గమనార్హం.

జీవో 49ని అమలు కానివ్వం

- ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు
- ఆదివాసీ సంఘాల నాయకులతో సమీక్షా సమావేశం



ఉట్నూర్‌రూరల్: సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి జూపల్లి, వేదికపై ఎంపీ, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే, కలెక్టర్లు

ఉట్నూర్‌రూరల్: జీవో 49ని అమలు కాకుండా చూస్తామని ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు హామీ ఇచ్చారు. శుక్రవారం మండల కేంద్రంలోని కేబీ ప్రాంగణంలోగల పీఎమ్మార్సీ సమావేశ మందిరంలో ఆదివాసీ సంఘాల నాయకులు, పెద్దలతో సమీక్ష నిర్వహించారు. అంతకుముందు కేబీ ప్రాంగణంలోని కుమురంభీం విగ్రహంపై పూలు చల్లి నివాళులర్పించారు. ముందుగా ఆదివాసీ పెద్దలు మాట్లాడుతూ.. పులుల సంరక్షణ కేంద్రాల ఏర్పాటు పేరిట జీవో 49 అమలు అంటూ ఫారెస్ట్ అధికారులు ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. జీవోను రద్దు చేయాలని ఆదివాసీ సంఘాల నాయకులు, గిరిజన పెద్దలు, ఎమ్మెల్యేలు కోవ లక్ష్మి, హరీశ్‌బాబు డిమాండ్ చేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. జీవో 49పై గెజిట్ నోటిఫికేషన్ ఇంకా జారీ చేయలేదని, అమల్లోకి రాలేదని చెప్పారు. గెజిట్ నోటిఫికేషన్ జారీ చేయవద్దని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. దీనిపై ఆదివాసీలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపారు. అటవీ, పర్యావరణ అంశం కేంద్ర ప్రభుత్వం పరిధిలో ఉంటుందని, రాష్ట్ర ప్రభుత్వానికి ఉన్న విస్తృత అధికారాలను ఉపయోగించి ఆదివాసీలకు మేలు చేసేలా సముచిత నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. ఇందుకు కేంద్ర ప్రభుత్వ సహకారం అందేలా చూడాల్సిన బాధ్యత రాష్ట్ర బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలపై ఉందని తెలిపారు.

గెజిట్ వచ్చిందన్న ఎంపీ నగేశ్

జీవో 49పై గెజిట్ రాలేదని మంత్రి జూపల్లి అంటున్న సందర్భంలో ఎంపీ గోడం నగేశ్ కల్పించుకుని గెజిట్ నోటిఫికేషన్ వచ్చిందని తెలిపారు. దీంతో స్పందించిన మంత్రి సమావేశంలోనే అటవీశాఖ ఉన్నతాధికారిని ఫోన్‌లో సంప్రదించగా ఇంకా జారీ చేయలేదని సమాధానం రాగా సమావేశం సజావుగా సాగింది. ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జు మాట్లాడుతూ.. సీఎం దృష్టికి సమస్య తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు. కలెక్టర్లు రాజర్షిషా, వెంకటేశ్ దోత్రే, ఎస్పీలు అఖిల్ మహాజన్, కాంతిలాల్ పాటిల్, డీఎఫ్‌వోలు నీరజ్‌కుమార్, ప్రశాంత్ బాజీరావు పాటిల్, ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా, రాయిసెంటర్ సర్మేడి దుర్గు, ఏఎస్పీ కాజల్, సబ్‌కలెక్టర్ యువరాజ్, ఆయా శాఖల అధికారులు, ఆదివాసీలు పాల్గొన్నారు.

ఇంద్రవెల్లి స్థూపం వద్ద నివాళి

ఇంద్రవెల్లి: ఇంద్రవెల్లి అమరవీరుల స్తూపానికి ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం స్మృతివనంలో మొక్క నాటారు. టీపీసీసీ ఉపాధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, ఎమ్మెల్సీ దండే విఠల్, కలెక్టర్ రాజర్షిషా, ఐటీడీఏ పీవో కుష్బూగుప్తా, ఏఎంసీ చైర్మన్ ముఖడే ఉత్తం, రగల్ జెండా ఆశయ సాధన కమిటీ అధ్యక్షుడు తోడసం నాగోరావ్ తదితరులున్నారు.

ఇంటి కోసం మహిళ ఆత్మహత్యాయత్నం



తహసీల్దార్ కార్యాలయం ఎదుట కూర్చున్న లక్ష్మి

మందమర్రిరూరల్: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం ఓ మహిళ తనకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యా ప్రయత్నం చేయడం చర్చనీయాంశమైంది. మండలంలోని క్యాతన్‌పల్లి మున్సిపాలిటీ పరిధిలోని కనుకదుర్గ కాలనీకి చెందిన పూరెల్లి లక్ష్మి తనకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని తహసీల్దార్‌కు వినతిపత్రం అందించింది. తనకు ఫస్ట్ లిస్ట్‌లో పేరు వచ్చిందని ఫైనల్ లిస్ట్‌లో తొలగించారని ఆరోపించింది. 30 ఏళ్లుగా అద్దె ఇంట్లో ఉంటూ ఇండ్లల్లో గిన్నెలు కడుక్కుని జీవనం సాగిస్తున్నానని తెలిపింది. అద్దె చెల్లించలేక ఇబ్బంది పడుతున్నానని వివరించింది. ఇల్లు కేటాయించాలని కోరింది. దరఖాస్తు పరిశీలించిన అనంతరం అర్హత ఉంటే తప్పకుండా ఇల్లు మంజూరవుతుందని తహసీల్దార్ సమాధానం ఇచ్చారు. వెంటనే మహిళ తహసీల్దార్ కార్యాలయం నుంచి బయటకు వచ్చి ముందుగానే వెంట తెచ్చుకున్న పెట్రోల్ మీద పోసుకుంది. ఇల్లు కేటాయించకుంటే ఆత్మహత్య చేసుకుంటానని తెలిపింది. అక్కడున్న కార్యాలయ సిబ్బంది అప్రమత్తమై ఆ మహిళ ప్రయత్నాన్ని నిలువరించి పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మహిళను అదుపులోకి తీసుకున్నారు. సముదాయించి ఆమె ఇంటికి పంపారు.

మనస్తాపంతో యువకుడి ఆత్మహత్య



అరుణ్ (ఫైల్)

తాంసి: మనస్తాపంతో యువకుడు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మండలంలోని జామిడి గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మునేశ్వర్ అరుణ్ (32) వ్యవసాయం చేస్తూ కుటుంబానికి అండగా ఉంటున్నాడు. గతేడాది అరుణ్ వివాహం నిశ్చయమై ఆ తర్వాత క్యాన్సిల్ అయింది. అలాగే తనకున్న రెండెకరాలపై జామిడి సహకార సంఘంలో రూ.2.30 లక్షల రుణం తీసుకోగా మాఫీ కాలేదు. దీంతో కొంత కాలంగా దిగులు చెందుతున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం వేకువజామున పంటచేనుకు వెళ్లి పురుగులమందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు అరుణ్‌ను అంబులెన్స్‌లో రిమ్స్ ఆస్పత్రికి తరలించగా, అప్పటికే పరిస్థితి విషమించి మృతి చెందాడు. మృతదేహాన్ని రిమ్స్ ఆస్పత్రిలో తాంసి ఎస్సై ప్రణయ్‌కుమార్ పరిశీలించారు. పంచనామా నిర్వహించి పోస్టుమార్టం కోసం తరలించారు. మృతుడి సోదరుడు కిరణ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యం



శేఖర్ (ఫైల్)

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని లాండసాంగ్వి శివారు ప్రాంతంలోగల వాగులో చేపల వేటకు వెళ్లి గల్లంతైన యువకుడు జొగ్దాన్ శేఖర్ (19) మృతదేహం శుక్రవారం లభ్యమైనట్లు ఎస్సై విష్ణువర్ధన్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ఆదిలాబాద్ పట్టణంలోని డాల్డా కంపెనీ ప్రాంతానికి చెందిన శేఖర్, వికాస్, కృష్ణ గురువారం చేపల వేటకు వెళ్లిన విషయం తెలిసిందే. చేపలు పట్టే సమయంలో శేఖర్ ప్రమాదవశాత్తు జారి వాగులో పడ్డాడు. నీటి ప్రవాహానికి కొట్టుకుపోయాడు. శేఖర్ కోసం గురువారం రాత్రి వరకు గాలించినా ఆచూకీ లభించలేదు. శుక్రవారం గాలింపు కొనసాగించగా అతడి మృతదేహం లభ్యమైంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. మృతుడి తల్లి రేఖ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కాళ్లు కడిగి వీడ్కోలు పలికారు



చంద్రబాయి కాళ్లు కడుగుతున్న ఆస్పత్రి సిబ్బంది

భైంసాటౌన్: పట్టణంలోని ఏరియాస్పత్రిలో పారిశుధ్య విభాగంలో పనిచేసిన కార్మికురాలు చంద్రబాయికి ఆస్పత్రి సిబ్బంది అరుదైన వీడ్కోలు పలికారు. పట్టణానికి చెందిన చంద్రబాయి 15 ఏళ్లుగా ఆస్పత్రిలో సేవలందిస్తోంది. 60 ఏళ్లు పూర్తి కావడం, అనారోగ్య కారణాలతో ఉద్యోగ విరమణ పొందింది. దీంతో శుక్రవారం ఆస్పత్రి సూపరింటెండెంట్ కాశీనాథ్ ఆధ్వర్యంలో ఆమెకు వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. శాలువా, పూలమాలతో సత్కరించారు. సిబ్బంది ఆమె కాళ్లు కడిగి ఆత్మీయంగా వీడ్కోలు పలికారు. దీంతో వైద్యులు అనిల్, నర్సులు, తోటి సిబ్బంది వారిని అభినందించారు.

పాలిసెట్ కౌన్సెలింగ్‌కు 295 మంది హాజరు

బెల్లంపల్లి: బెల్లంపల్లి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల హెల్ప్‌లైన్ సెంటర్‌లో శుక్రవారం పాలిసెట్–25లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. రెండోరోజు విద్యార్థులు వివిధ ప్రాంతాల నుంచి వచ్చారు. ఉదయం 9 గంటలకు ప్రారంభమైన కౌన్సెలింగ్ సాయంత్రం 6 గంటల వరకు సాగింది. మొత్తం 295 మంది విద్యార్థులు హాజరయ్యారు. వీరి సర్టిఫికెట్లను సంబంధిత అధికారులు పరిశీలించి ధృవీకరించారు. పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ దేవేందర్, కౌన్సెలింగ్ ఇన్‌చార్జి టీ మధుకర్, అధ్యాపకులు పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ



సంపత్‌కుమార్

లక్సెట్టిపేట: మున్సిపల్ కమిషనర్‌గా సంపత్‌కుమార్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇక్కడ పని చేసిన మారుతీప్రసాద్ సీడీఎంఏకు బదిలీ కాగా, హైదరాబాద్‌లోని సెక్రటేరియట్‌లో విధులు నిర్వహిస్తున్న సంపత్‌కుమార్ బది లీపై ఇక్కడకు వచ్చారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం అతడికి కార్యాలయ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

నకిలీ విత్తనాలపై ఉక్కుపాదం

ఇచ్చోడ: నకిలీ విత్తనాలపై ఉక్కు పాదం మోపుతున్నామని ఇచ్చోడ సీఐ రాజు తెలిపారు. నకిలీ విత్తనాలు అమ్ముతున్న ఇద్దరిపై ఈనెల 16న కేసు నమోదు చేయగా, పరారీలో ఉన్న వ్యక్తిని శుక్రవారం పట్టుకుని రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. శుక్రవారం ఇచ్చోడ పోలీస్‌స్టేషన్‌లో ఇందుకు సంబంధించిన వివరాలు విలేకరులకు వెల్లడించారు. జిల్లాలో నకిలీ విత్తనాలను అరికట్టేందుకు ఎస్పీ ఆదేశాల మేరకు ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ బృందం తనిఖీలు నిర్వహిస్తుందని తెలిపారు. ఇందులో భాగంగానే ఈనెల 16న ఇచ్చోడ మండలం దాబా(బి) గ్రామంలో తనిఖీలు నిర్వహించగా నరవాటే ఈశ్వర్‌ను పట్టుకున్నట్లు పేర్కొన్నారు. అతడి వద్ద 20 బ్యాగ్‌ల పింక్ బాండ్ 5జీ నకిలీ విత్తనాలు లభించగా, విచారణలో తాను ఆదిలాబాద్‌కు చెందిన పిప్పల్వార్ సునీల్ వద్ద తీసుకున్నట్లు చెప్పాడని తెలిపారు. వీరిపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు. కాగా, పరారీలో ఉన్న పిప్పల్వార్ సునీల్‌ను ఆదిలాబాద్ జిల్లా సాంకేతిక నిపుణులు, రిజర్వ్ సబ్ ఇన్‌స్పెక్టర్ ఆర్.గోపీకృష్ణ సూచన మేరకు ఇచ్చోడ ఎస్సై పురుషోత్తం హైదరాబాద్‌కు పోలీస్ బృందాన్ని పంపి అతడిని పట్టుకున్నట్లు పేర్కొన్నారు.

ఆర్జీయూకేటీలో ధ్రువపత్రాల పరిశీలన



సర్టిఫికెట్ల పరిశీలనలో ఇన్‌చార్జి వీసీ, సిబ్బంది

బాసర: రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీస్ (ఆర్జీయూకేటీ) బాసరలో మహబూబ్‌నగర్ కేంద్రానికి చెందిన స్పోర్ట్స్, ఎన్‌సీసీ కోటా ఆధారిత విద్యార్థుల ధ్రువపత్రాల పరిశీలన శుక్రవారం చేపట్టారు. ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ గోవర్ధన్, ఓఎస్డీ ప్రొఫెసర్ ఈ మురళీదర్శన్ ప్రక్రియను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ గోవర్ధన్ మాట్లాడుతూ.. యూనివర్సిటీ చాలా సమర్థవంతంగా, సజావుగా ముందుకు సాగుతోందని తెలిపారు. నాణ్యమైన విద్య, విద్యార్థుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు చెప్పారు. ప్రతీ సమస్యను పట్టుదలతో పరిష్కరిస్తున్నట్లు పేర్కొన్నారు. సమర్థవంతంగా యూనివర్సిటీని నిర్వహించడమే తమ ముఖ్య ఉద్దేశమని తెలిపారు. ఎన్‌సీసీ కోటాలో విద్యార్థులు అందించిన క్యాంప్ సర్టిఫికెట్లు, రిపబ్లిక్ డే పరేడ్ సర్టిఫికెట్లు పూర్తిగా పరిశీలించినట్లు చెప్పారు. స్పోర్ట్స్ కోటా కోసం 31 క్రీడల జాబితాలో లభించే ఆటల ఆధారంగా రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పొందిన ప్రమాణ పత్రాలను తప్పనిసరిగా ధ్రువీకరించినట్లు తెలిపారు. క్రీడా సంఘాల గుర్తింపు, పోటీల స్థాయి, తేదీ, అర్హత ప్రమాణాలను బట్టి జాగ్రత్తగా తనిఖీ చేసినట్లు చెప్పారు. ధ్రువపత్రాల పరిశీలనను కన్వీనర్ డాక్టర్ చంద్రశేఖర్, కోకన్వీనర్లు డాక్టర్ దేవరాజు, డాక్టర్ విఠల్, డాక్టర్ భవ్‌సింగ్, డాక్టర్ రాకేశ్‌రెడ్డి సమన్వయం చేశారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ ఇన్‌చార్జి దస్తగిరి, స్పోర్ట్స్ ఇన్‌చార్జి పీడీ శ్యాంబాబు, సహాయకులు కిషన్, ఉదయ్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ విద్యార్థిని మృతి

- సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎదుట ప్రజాసంఘాల ధర్నా



స్వప్న (ఫైల్)



కళాశాల వద్ద ఆందోళన చేస్తున్న నాయకులు

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థిని కుమ్మరి స్వప్న (19) ఈ నెల 24న రాత్రి కళాశాల భవనం మూడో అంతస్తు నుంచి కిందపడి తీవ్రంగా గాయపడిన ఘటన తెలిసిందే. కాగా స్వప్నను హైదరాబాద్‌లోని నిమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ శుక్రవా రం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపా రు. ఆమె కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా బెజ్జూర్ మండలం మార్థిడి గ్రామానికి చెందిన కుమ్మరి లచ్చన్న–సుక్కవ్వ దంపతులకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కూతుళ్లు. చిన్న కూతురు స్వప్న జిల్లా కేంద్రంలోని సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ మహిళా డిగ్రీ కళాశాలలో బీజెడ్సీ రెండో సంవత్సరం చదువుతోంది. లచ్చన్న వ్యవసాయంతోపాటు ఆర్ఎంపీగా పని చేసి కుటుంబాన్ని పోషిస్తున్నాడు. కాగా, స్వప్న మరణాన్ని లచ్చన్న కుటుంబ సభ్యులు జీర్ణించుకోలేకపోతున్నారు. స్వప్న చికిత్స పొందుతూ మృతి చెందిన అనంతరం లచ్చన్న హైదరాబాద్‌లోని పంజగుట్ట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు పోస్టుమార్టం పూర్తి చేసి స్వప్న మృతదేహాన్ని అప్పగించారు. కాగా, స్వప్న మృతి మిస్టరీగానే మిగిలింది.

హాస్టల్ భవనం వద్ద ఆందోళన

స్వప్న మరణ వార్త తెలుసుకున్న కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా ప్రజాసంఘాల నాయకులు, కుటుంబ సభ్యులు, విద్యార్థి సంఘాల నాయకులు, బీఆర్ఎస్ నాయకులు జిల్లా కేంద్రంలోని సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ మహిళా డిగ్రీ కళాశాల ఎదుట ఆందోళనకు దిగారు. స్వప్న మృతికి కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. స్వప్న కుటుంబానికి రూ.50లక్షల పరిహారం, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న సీఐ ప్రమోద్‌రావు కళాశాల వద్దకు చేరుకుని ఆందోళనకారులతో మాట్లాడారు. స్వప్న కుటుంబానికి న్యాయం జరిగేలా చూస్తామని భరోసా ఇచ్చి ఆందోళన విరమింపజేశారు.

స్వగ్రామానికి మృతదేహం తరలింపు

ముందస్తు చర్యల్లో భాగంగా పోలీసులు స్వప్న మృతదేహాన్ని ఆమె స్వగ్రామం మార్థిడికి హైదరాబాద్ నుంచి నేరుగా తరలించారు. కళాశాల భవనం వద్ద ఎలాంటి హింసాత్మక ఘటనలు చోటు చేసుకోకుండా ఉండేందుకు పోలీసులు ముందస్తుగా భారీగా మోహరించారు.